క్లుప్తంగా

26న మండల సమావేశం

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు జరుపుతున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఇందులో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మట్లి రాజుల కోటలో విద్యార్థుల సందడి



కోటను సందర్శిస్తున్న విద్యార్థులు

సిద్దవటం : బద్వేల్‌లోని శ్రీక్రిష్ణా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సిద్దవటం మట్లి రాజుల కోటను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ విహారయాత్రలో భాగంగా విద్యార్థులను మట్లి రాజుల కోటకు తీసుకువచ్చామని చెప్పారు. వివిధ తరగతులకు చెందిన 80 మంది విద్యార్థులు కోట సందర్శనకు వచ్చినట్లు తెలియజేశారు. విహారయాత్రల వల్ల మరింత జ్ఞానం వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజయ్ నాగశ్రీ, మున్నా, కళావతి, రాణి, సుచిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ



ఆశ్రమవాసులకు ఆహారం అందించిన దాతలు

ఓబులవారిపల్లె : జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాపిరెడ్డిపల్లెకు చెందిన కీ.శేలు చల్లా రామకృష్ణారెడ్డి, చల్లా జయరామిరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలోని దివ్యాంగులు, వృద్ధులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూలంగి సేవ



ప్రత్యేక అలంకారంలో శివలింగం

పెనగలూరు : మండల కేంద్రంలోని పురాతన కాలం నాటి శివాలయంలో శివునికి పూలంగి సేవ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో పవిత్రమైన కార్తిక మాసం సందర్భంగా ఈ పూలంగి సేవలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ పూజారులు తెలిపారు. కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ఇంటివద్దకే పోస్టల్ సేవలు



పోస్టల్ సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇంటివద్దకే పోస్టల్ సేవలు అందిస్తున్నామని ఎస్‌పీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఇంటింటికి పోస్టల్ సేవలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ సిబ్బంది గ్రామాల్లోని ఇంటివద్దకు వెళ్లి అకౌంట్లు కావాల్సిన వారికి ఇవ్వడం జరిగింది. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరికైతే ఎస్‌పీసీఐ లేదో సమీపంలో ఉన్న పోస్టాఫీసులలో సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ చైతన్య, గణేష్, పోస్టల్ జీడీఎస్ సభ్యులు బిఎంయూ కొమ్మూరు శంకర్ రెడ్డి, కత్తి స్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయశ్రీ

పుల్లంపేట : మండలంలోని అప్పారాజుపేట పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంపీడీఓ జయశ్రీ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు అర్థమయ్యేటట్టు విద్యాబోధన చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. తదుపరి రంగంపల్లి సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో ప్రాణం.. ఒళ్లంతా హూనం!

- ఆర్ధంతరంగా నిలిచిన రాయచోటి - వేంపల్లి రోడ్డు పనులు
- కంకర తేలిన రోడ్లలో ప్రయాణం నరక ప్రాయం అంటున్న వాహనదారులు
- ప్రభుత్వం పనులు పూర్తి చేయించాలని కోరుతున్న ప్రయాణికులు



మర్రిచెట్టు వద్ద కంకరతో దర్శనమిస్తున్న రోడ్డు



మట్టిరేవుల వద్ద ప్రమాదకరంగా ఉన్న మట్టి దిబ్బ



ఏకిలపల్లి వద్ద ఆగిన బ్రిడ్జి పనులు

లక్కిరెడ్డిపల్లి : నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే రాయచోటి - వేంపల్లి రోడ్డు మార్గం గుంతలమయమై అధ్వాన స్థితికి చేరుకుంది. రెండేళ్లుగా అటువైపు వెళ్తున్న ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు గుంతలమయమైన రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిపాటుగా ఎంతోమంది ప్రయాణికులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవడంతోపాటు మరికొంత మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరుగుతున్నా అటు ప్రభుత్వంగానీ, ఇటు ఎన్‌హెచ్‌ఓ అధికార యంత్రంగాని పట్టించుకున్న పాపానపోలేదు. చిన్నపాటి చినుకులు పడితే మాత్రం బురదమయం, రోడ్లు డ్రైనేజీని తలపిస్తూ దర్శనమిస్తూ ఉంటాయి. దీంతో ద్విచక్రవాహనదారులు, ఆటోలు, జీపులలో ప్రయాణం చేసేవారు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయక తప్పడం లేదని వాపోతున్నారు. రాయచోటి - చాగలమర్రి జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా రూ. 245 కోట్లు నిధులతో ఎన్‌ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టు పనులు చేపట్టి రెండేళ్లు గడుస్తోంది. మొత్తం రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 450 కోట్లు కేటాయించగా ఇందులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములు కోల్పోయిన వారి పొలాల్లోని బోరుబావులు, బోర్లు, విద్యుత్ స్తంభాలతోపాటు లక్కిరెడ్డిపల్లి టౌన్‌లో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికిగాను ఇరువైపులా పక్కా గృహాలు కోల్పోయిన వారికి పరిహారం అందించి రోడ్డు నిర్మాణం చేయాలి. ఈ మార్గంలో చిన్నపాటి బ్రిడ్జిలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ కల్వర్టుల కోసం ఎక్కడికక్కడ తవ్వేసి వదిలేశారు. దీంతో పనులు అసంపూర్తిగా ఉండటమే కాక ప్రయాణికులకు ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయపడేలా ఈ మార్గం తయారైంది. రాత్రి సమయాలలో ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే ఒళ్లు హూనం అయ్యేలా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలలో ప్రయాణం చేయడానికి వాహనదారులు ఆందోళన చెందుతున్నామని వాపోతున్నారు. అటు వాహనాలు పాడైపోవడంతోపాటు నిత్యం అనారోగ్య సమస్యలకు గురి కావాల్సి వస్తోందని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు



గుంతలమయమైన ఈ మార్గంలో ద్విచక్రవాహనంలో పోలేకున్నాం. ఏడాది నుంచి రాయచోటికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. వెడల్పుతో బాగున్న రోడ్లను ఎక్కడికక్కడ తవ్వి వదిలేస్తున్నారు. దీంతో దుమ్ముతోపాటు ప్రమాదాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. త్వరగా రోడ్డును బాగు చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– గంగిరెడ్డి, ద్విచక్ర వాహనదారుడు, కోనంపేట, లక్కిరెడ్డిపల్లి

రాత్రిళ్లు వెళ్లాలంటే భయం



రాత్రి సమయాలలో రాయచోటికి వాహనంలో వెళ్లాలంటే భయంగా ఉంది. మా ఊరు నుంచి రాయచోటి వరకు రోడ్డు అసలు బాగలేదు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ద్విచక్రవాహనంలో రాయచోటికి వెళ్లాలన్నా, రాయచోటి నుంచి మా ఊరికి రావాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు, నాయకులు మా ఇబ్బందులు అర్థం చేసుకొని త్వరగా రోడ్డును బాగు చేయాలి.

– ఖాదర్ వలీ, కోనంపేట, లక్కిరెడ్డిపల్లి

ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ తనిఖీ



రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వారు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌లోని కేసుల వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివప్రసాద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను వెంకటరమణకు అందజేస్తున్న ఎస్ఐ

పుల్లంపేట : ప్రతి ఒక్కరూ తమ విలువైన సెల్‌ఫోన్‌లను ఎక్కడపడితే అక్కడ వదిలివేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్ గౌడ్ సూచించారు. గురువారం రాచపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. పుల్లంపేటకు చెందిన బొగ్గలి రామచంద్రారెడ్డి వెంకటరమణ ఫోన్‌ను పుల్లంపేట ఎస్ఐకు అందజేశారు. దీంతో రామచంద్రారెడ్డిని పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ అభినందించారు. అనంతరం ఎస్ఐ సెల్‌ఫోన్‌ను వెంకటరమణకు అందజేశారు.

హెచ్చరికలతో సరి.. చర్యలేవీ?

- ఆర్‌అండ్ బీ స్థలంలో తొలగించని రేకుల షెడ్లు
- అధికారులు హెచ్చరించినా తగ్గని ఆక్రమణదారులు



ఆర్‌అండ్‌బీ స్థలంలో తొలగించని రేకుల షెడ్లు

గాలివీడు : కోట్లు విలువచేసే ఆర్ అండ్ బీ స్థలం ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నారు. సర్వే నంబర్–2266లో దాదాపు 1.80 సెంట్లు ఆర్ అండ్ బీ స్థలంలో కొంత రోడ్డు విస్తరణ నిమిత్తం కేటాయించగా మిగిలిన స్థలంలో ఆక్రమణదారులు దర్జాగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే క్రమంలో స్థానికుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఆర్ అండ్ బీ డీఈ వెంకటసుబ్బయ్య రెండు పర్యాయాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని హెచ్చరించారు. హెచ్చరికలను బుట్టదాఖలు చేస్తూ రేకుల షెడ్లలో దుకాణాలను ప్రారంభించేందుకు ఆక్రమణదారులు రంగం సిద్ధం చేశారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ఆక్రమణ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదిగేలా కృషి చేయాలి



విద్యార్థుల వర్కింగ్ మోడల్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాజంపేట టౌన్ : విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించగలరని డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థులు సోషల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన వర్కింగ్ మోడల్స్‌ను డిప్యూటీ డీఈఓ సందర్శించి మాట్లాడారు. చాలా మంది విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలన్న లక్ష్యంతోనే ఉంటారని, అయితే శాస్త్రవేత్తలు కావాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శాస్త్రవేత్తలు అయ్యేందుకు ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన అన్ని వర్కింగ్ మోడల్స్ సమాజానికి ఉపయోగపడేలా ఉన్నాయని, విద్యార్థుల ఆలోచన సృజనాత్మకంగా ఉందని కొనియాడారు. న్యాయనిర్ణేతలుగా నరేష్, శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 సుబ్బరాయుడు, హెచ్‌ఎం కె.జయలక్ష్మి, సోషల్ ఉపాధ్యాయులు సి.ఆదిలక్ష్మి, అచ్యుత, లక్షుమ్మ, వీరప్రసాద్ పాల్గొన్నారు.

ఆకేపాడు పాఠశాల తనిఖీ

మండలంలోని ఆకేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేశారు. డిప్యూటీ డీఈఓ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. టెన్త్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాల సాధించేలా విద్యార్థులకు బోధనలు చేయాలని తెలిపారు.

‘లయన్స్’ సేవలను ఆదర్శంగా తీసుకోండి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఈఓ, ట్రాఫిక్ సీఐ తదితరులు

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డీఈఓ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డిలు పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన పలురకాల పోటీల విజేతలకు గురువారం డైట్ సభా భవనంలో బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛంద సేవాసంస్థలు చేపడుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి తాము సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, అధ్యాపకులు శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, నాగరాజు, అసదుల్లా, రెడ్డెయ్య, రాయచోటి గ్రంథాలయాధికారి జయభరత్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి, జోన్ ఛైర్మన్ మహమ్మద్, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ హరీష్‌చంద్రతోపాటు డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీ తిరుణంపల్లి దళితవాడలో నూతనంగా నిర్మించిన రామాలయం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జమ్మలమడుగుకు చెందిన శేఖర్ స్వామి ఆధ్వర్యంలో 9 మంది వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని గ్రామస్తులు జరిపారు. గత మూడు రోజులుగా వేదపండితుల మంత్రోచ్ఛరణలు, వివిధ హోమాలు నిర్వహించారు. ప్రతిరోజూ మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఆలయంలో ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా ఆలయంలో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, బ్యాండ్ వాయిద్యాల నడుమ కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది.

డిసెంబర్ 8న నీటి సంఘం ఎన్నికలు

సుండుపల్లె : మండల పరిధిలోని ప్రాజెక్టుకు, చెరువులకు సంబంధించిన ఎన్నికలు డిసెంబర్ 8వ తేదీన నిర్వహించనున్నట్లు జల వనరులశాఖ ఏఈ నాగేంద్ర నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛా ప్రాజెక్టు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటి వాగు చెరువు, ఊట చెరువు, నారాయణరెడ్డి చెరువులకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. పాత ఓటరు లిస్టు ప్రకారం 3127 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి ఒక రైతు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

రాయచోటి వాసికి సేవా పురస్కారం

రాయచోటి టౌన్ : వివిధ సేవా కార్యక్రమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ అబ్దుల్ కలాం కెరటం ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్ జాతీయ స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. వివిధ రంగాల్లో వినయ్ కుమార్ చేసిన సేవలను గుర్తించిన ఫైన్ ఆర్ట్ ఫెడరేషన్ వారు బుధవారం న్యూఢిల్లీలో ఈ పురస్కారం అందించినట్లు తెలిపారు. ఈ పురస్కారాన్ని భారతదేశ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్‌కే రెహమాన్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు వివరించారు.

గంగమ్మ ఆలయంలో కార్తిక దీపోత్సవం



కార్తిక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని నడివీధి గంగమ్మ ఆలయం వద్ద గురువారం కార్తిక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో దీపాలను వెలిగించారు. దీప కాంతి నడుమ అమ్మవారి ఆలయం శోభాయమానంగా వెలుగొందింది.

నేటి నుంచి ఖాదర్‌షా ఔలియా దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ : ఐక్యతకు ప్రతీకగా నిలిచే హజ్రత్ ఖాదర్ షా ఔలియా దర్గా ఉరుసు మహోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా 22వతేదీ శుక్రవారం సాయంత్రం గంధం, 23వతేదీ శనివారం ఉరుసు, అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం, 24వతేదీ ఆదివారం సాయంత్రం తహలీల్ ఫాతేహా, ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కవి సమ్మేళనంలో దేశ నలుమూలల నుంచి ఉర్దూ కవులు పాల్గొనున్నట్లు ముషాయిరా కార్యదర్శి ఖమర్‌అమీన్, కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు.

గ్రంథ పఠనంతోనే ఉన్నత శిఖరాలు



సంబేపల్లె: బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



నందలూరు: గ్రంథాలయాల విశిష్టతను వివరిస్తున్న ఎంఈఓ నాగయ్య

సంబేపల్లె : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలనీ, రోజులో కనీసం రెండు గంటలు గ్రంథాలయాలకు వెళ్లి గ్రంథ పఠనం చేసే అలవాటు విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేరుస్తుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సి.దిలీప్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరిగిన చొక్క అయినా తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరేశలింగం గారు చెప్పిన మాటలు మనకు పుస్తకం విలువను తెలియజేస్తుందన్నారు. అక్షర రూపు దాల్చిన సిరా చుక్క లక్ష మెదళ్ల కదలిక అని పేర్కొన్న కాళోజి నారాయణ్ రావు మాటల్లో అక్షరం, చదువు గొప్పతనం మనకు అర్థమవుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం 1968లో జీఓ ద్వారా ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రంథాలయాలు ప్రజలకు విజ్ఞానాన్ని అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని సంబేపల్లె మండలం గ్రంథాలయాధికారి రెడ్డిశేఖర్ అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అందించేవి గ్రంథాలయాలు

నందలూరు : విజ్ఞానాన్ని అందించేవి గ్రంథాలయాలని ఎంఈఓ ఎల్.నాగయ్య అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ముగింపు వేడుకలు గురువారం జరిగాయి. ఈ సమావేశం ఎల్.నాగయ్య అధ్యక్షతన జరిగింది. ఎంఈఓ–2 సీఆర్ అనంత కృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలలో వివిధ పుస్తకాలు అందుబాటులో ఉంటాయని గ్రంథాలయశాఖ అధికారి రవిశంకర్ రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి తహసీల్దార్ జయన్న, ఉపాధ్యాయులు లోకమాన్ సింగ్, కృపానందం, వెంకటసుబ్బయ్యలు పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రమాణాలు పాటించి ప్రమాదాలు నివారిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ సుబ్బరాయుడు

రాయచోటి (జగదాంబసెంటర్) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు – 1,2 గుర్రప్ప, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతా పంకజ్, ఐక్యుఏసీ అధిపతి కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంలో సమాజం బాధ్యత వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను పాటించాలన్నారు. అనంతరం రాయచోటి మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ విభాగం ప్రతినిధులు సుబ్బరాయుడు, అజయ్‌కుమార్‌లు ట్రాఫిక్ నియమాలను వివరిస్తూ, హెల్మెట్లను సరిగ్గా ఉపయోగించడం, సీటు బెల్టు ధరించడం, పాదచారుల భద్రత గురించి ప్రాథమిక సమాచారాన్ని తెలియజేశారు. అలాగే సాధారణంగా జరిగే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, వాటి ప్రభావాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రస్తా వివాదం ; అధికారుల సర్వే



సర్వే నం.36లో రస్తా విషయమై సర్వేచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 36లో హర్షసింహ అనే రైతుకు సంబంధించిన భూమిలో కొంతమంది రైతులు రస్తా ఆక్రమణ చేసుకొని, ఏకంగా గేటును ఏర్పాటు చేసుకోవడంతో తమకు న్యాయం చేయాలని రైతు హర్షసింహ ఈనెల 18వ తేదీన కడప కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణకు జిల్లా కలెక్టర్ మండల రెవెన్యూ యంత్రాగాన్ని ఆదేశించడంతో గురువారం వారు సర్వేనెంబర్ 36లో సర్వే చేశారు. ఈ భూమి హర్షసింహకు సంబంధించినదని, ఇక్కడ వేరే వ్యక్తులకు ఎటువంటి రస్తాలేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ కేశవులు, సచివాలయ సర్వేయర్ పురుషోత్తంరెడ్డి, వీఆర్‌ఏ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన గ్రామోత్సవం



గాలివీడు: పడి పూజలో అయ్యప్ప స్వామి భజనలు చేస్తున్న మాలధారులు



నందలూరు: గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి, మాలధారులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామం ఎర్రచెరువు కట్టపై వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నుండి శ్రీ అయ్యప్పస్వామి గ్రామోత్సవం అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అత్యంత ఘనంగా జరిగింది. ఈ గ్రామోత్సవంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని అయ్యప్పస్వామి భజనలు చేసుకుంటూ నందలూరు రైల్వేకేంద్రంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమన శివశంకర్ రెడ్డి, బాలాంజనేయులు, గుండు గోపాల్ రెడ్డి, ఎముక దుర్గయ్య, తోట శివశంకర్, గుండు మల్లికార్జున రెడ్డి, ఆకేపాటి రమేష్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, అరిగె హరిబాబు, ఆనాల మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

గాలివీడు : మండలంలోని పేరంపల్లి గ్రామం తాతిరెడ్డిగారిపల్లె వద్ద ఉన్న దేవాలయాల ప్రాంగణం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది. తాతిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్తులు, అయ్యప్ప స్వాములతో కలసి బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అంబలం పూజ మహోత్సవం గురుస్వామి రామిరెడ్డి స్వామి మంత్రోచ్ఛారణ మధ్య అత్యంత వైభవంగా సాగింది. అరటి బోదెలతో అలంకరించిన అయ్యప్ప అంబలం ప్రత్యేక వేదికపై అయ్యప్ప, గణపతి, సుబ్రమణ్య స్వాముల మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు చేసిన భజనలతో ఆ ప్రాంతం భక్తి గీతాలతో మార్మోగింది. భజన బృందం ఆధ్వర్యంలో స్వాములు శరణు ఘోషల మధ్య భజనలు, కీర్తనలు పాడుతూ ప్రత్యేక పడిపూజ చేశారు. చివరగా మాలదారులకు, గ్రామస్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.